క్లుప్తంగా

శివాలయంలో మువ్వా ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లిటౌన్: టీఎస్ ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి సత్తుపల్లికి విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని గుడిపాడులో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మారుతి సూరిబాబు, పూచి గోవర్ధన్, మారుతి బాబురావు, మానస నాని, కొత్తూరు కోటేశ్వరరావు, రిటైర్డ్ జైలర్ వెంకటేశ్వరరావు, మట్టా ప్రసాద్, రాంబాబు, వేముల పల్లి మధు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ



ఆర్కే ఫౌండేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

మధిర: మతిస్థిమితం లేని మహిళ ఆదివారం మధిర – మోటమర్రి రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఒక మహిళ అనుమానస్పదంగా రైలు పట్టాలపై వెళ్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు ఆమెను ఆపే ప్రయత్నం చేయగా వారి చేతులను గాయపరిచి రైలు పట్టాలపై వెళ్తుంది. స్థానికులు ఆర్కే ఫౌండేషన్ నిర్వాహకులు దోర్నాల రామకృష్ణకు, రైల్వే పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం తెలుపగా.. ఆయన రైల్వే పోలీసులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని మహిళను రక్షించారు. ఆమెను మతిస్థిమితం లేని మహిళగా గుర్తించి ఆర్కే ఫౌండేషన్ అనాథాశ్రమానికి తరలించారు.

నియామకం



నియామకపత్రాన్ని అందిస్తున్న అల్లిక రామకృష్ణ

కారేపల్లి: అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం కారేపల్లిలో జిల్లా అధ్యక్షుడు అల్లిక రామకృష్ణ,గురుస్వామి తాంద్ర రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలాధ్యక్షుడిగా సింగరేణికి చెందిన గొడుగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బొంకలతండాకు చెందిన మాలోత్ నరేష్‌ను నియమించి నియామక పత్రాన్ని అందించారు.

దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి

ముదిగొండ: ముదిగొండ నుంచి న్యూలక్ష్మీపురం–సువర్ణాపురం, చిరుమర్రి, వనంవారికిష్టాపురం రహదారిలో దుమ్ములేవకుండా రహదారిపై నీళ్లు చల్లించాలని, అతివేగంగా వెళ్తున్న టిప్పర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని యువకులు కోరారు. ఆదివారం టిప్పర్లను ముదిగొండలో యువకులు అడ్డుకున్నారు. రహదారి నిర్మాణ పనులు సందర్భంగా వాహనాలు వేగంగా వెళ్తుండడంతో దుమ్ము లేవడంతో.. ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. రహదారి నిర్మాణపనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

వేంసూరు: ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ పదవీకాలం పూర్తికావడంతో ఆదివారం వేంసూరు రైతువేదికలో శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదే విధంగా బదిలీపై వెళ్లిన అధికారులకు మాజీ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ప్రజా సేవలో పదవి మాత్రమే విరమణ ఉంటుంది కానీ.. ప్రజా సేవకు విరమణ ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సుమలత, వైస్ ఎంపీపీ శ్రీలక్ష్మీ, ఎంపీటీసీలు రాఘవరెడ్డి, వెంకటేశ్వరరావు, ఝాన్సీ లక్ష్మీ, లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధం

ముదిగొండ: విద్యుత్ చార్జింగ్‌లో ఉన్న ఎలక్ట్రిక్ స్కూటీ దగ్ధమైన సంఘటన ముదిగొండ మండలం సువర్ణాపురంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సువర్ణాపురానికి చెందిన వేల్పుల వెంకటరామారావు తన ఎలక్ట్రిక్ స్కూటీకి శనివారం రాత్రి విద్యుత్ చార్జింగ్ పెట్టారు. చార్జింగ్ అవుతున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో అతని కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.



బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం



వైద్యులేరి..?

పేరుకే 30 పడకల ప్రభుత్వాస్పత్రి

- వైద్యుల కొరతతో అందని సేవలు
- భర్తీకి నోచుకోని ఐదు వైద్య పోస్టులు
- స్పందించని పాలకులు, అధికారులు
- ఇబ్బంది పడుతున్న రోగులు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలోని 30 పడకల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డాక్టర్ల కొరత తీవ్రంగా వేధిస్తుంది. దీంతో డాక్టర్లు లేకుండా కేవలం బస్తీ దవాఖానా ఇన్‌చార్జ్ డాక్టర్, దంత వైద్యులు, నర్సులతోనే అరకొర వైద్యం మాత్రమే రోగులకు అందుతుంది. ఈ ఆస్పత్రికి ఐదుగురు డాక్టర్లుండాల్సి ఉండగా ఏ ఒక్క పోస్టు కూడా భర్తీకి నోచుకోలేదు.

ఇన్‌చార్జ్ డాక్టరే దిక్కు..

మండలంలోని మడుపల్లి బస్తీ దవాఖానా డాక్టర్ (ఎంఎల్‌హెచ్‌పీ) మాత్రం ఇక్కడ ఇన్‌చార్జ్ డాక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈయన అక్కడి ఆస్పత్రితో పాటు ఇక్కడ రోగులకు సేవలందించాల్సి ఉంది. గడిచిన సంవత్సర కాలంగా డాక్టర్ల కొరత ఇలానే ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇలాఖాలో కూడా వైద్యశాఖ ఉన్నతాధికారులు డాక్టర్ల పోస్టులు భర్తీ చేయకుండా ఇలా వ్యవహరించడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకు జరిగిన మండల సమావేశంలో కూడా బస్తీ డాక్టర్ సాకేత్‌ను జెడ్పీటీసీ కవితతో పాటు పలువురు సభ్యులు ప్రశ్నించారు.

భర్తీకి నోచుకోని పోస్టులు..

ఈ ఆస్పత్రిలో డాక్టర్ పోస్టులతో పాటు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి. డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో మండలంలోని గ్రామాల్లో ఉన్న హెల్త్ సబ్‌సెంటర్‌ల పర్యవేక్షణ సైతం కొరవడింది. మీనవోలు, బనిగండ్లపాడు సబ్ సెంటర్‌లలో హెల్త్ అసిస్టెంట్ పోస్టులు, జమలాపురం, మామునూరు, భీమవరం సబ్‌సెంటర్ల ఏఎన్ఎం పోస్టులు కూడా ఖాళీగా ఉడడంతో.. రోగులకు, గర్భిణులకు సక్రమంగా సేవలు అందడం లేదు.

పర్యవేక్షణ కరువు..

గ్రామాల్లో వైద్య సేవలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయా.. లేదా అనే విషయమై పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లోని రోగులకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఈ ఆస్పత్రిలో కేవలం డెంటల్, ఆయుర్వేద వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. ప్రతిరోజూ ఆస్పత్రి ఓపీ వేళల్లో దాదాపు వందమంది పైగా రోగులు వస్తుండగా వారికి ఇన్‌చార్జ్ (ఎంఎల్‌హెచ్‌పీ) డాక్టర్, స్టాఫ్ నర్సులే వైద్యం చేస్తున్నారు. ఇక్కడ ఎక్స్‌రే ప్లాంట్ లేకపోవడంతో పాటు.. ఎవరికైన రక్త పరీక్షలు, ఇతరత్రా పరీక్షలకు ఖమ్మం ఆస్పత్రికి బ్లడ్ సాంపిల్స్ పంపిస్తున్నారు. కావున ఇకనైనా ప్రభుత్వం స్పందించి పోస్టుల భర్తీ విషయమై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి..



పీహెచ్‌సీలో వైద్యుల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలి. డాక్టర్లు లేకపోవడంతో రోగులకు బాగా ఇబ్బంది కలుగుతుంది. ఇన్‌చార్జ్‌గా బస్తీ దవాఖానా వైద్యుడు మాత్రమే సేవలందిస్తున్నారు. నాణ్యమైన వైద్యం అందడం లేదు. ఈ విషయాన్ని ఇప్పటికే భట్టి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది.

– వేమిరెడ్డి రామిరెడ్డి, బనిగండ్లపాడు

పేరుకే పెద్దాస్పత్రి..



పేరుకే పెద్దాస్పత్రి.. కానీ రోగులకు సేవలందించడానికి ఒక్క డాక్టర్‌కూడా లేదు. అసలు డాక్టర్ లేని దవాఖానాను ప్రభుత్వం ఎలా నడుపుతుంది. మండలంలోని 31 జీపీల్లో 50వేల మందికి వైద్యం అందించాల్సిన ఉంటుంది. కానీ ఆస్పత్రిలో ఒక్క డాక్టర్ పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో వైద్య సేవలు ఎలా అందిస్తారు.

– శీలం కవిత, జెడ్పీటీసీ, ఎర్రుపాలెం

విధులు నిర్వర్తిస్తున్నాం..



మధిర మండలం మడుపల్లి బస్తీ దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్‌గా పని చేస్తున్నా. డిప్యూటేషన్‌పై బనిగండ్లపాడు పీహెచ్‌సీలో విధులు నిర్వర్తిస్తున్నా. ఆస్పత్రిలో ఐదు డాక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో.. కొంత ఇబ్బంది పడుతున్న మాట వాస్తవమే. రోగులకు అందుబాటులో ఉంటూ శక్తివంచన లేకుండా సేవలు అందిస్తున్నాం.

– ఏ.సాకేత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ వైద్యుడు, బనిగండ్లపాడు ఆస్పత్రి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న చందర్‌రావు

కల్లూరు: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు పసుమర్తి చందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కల్లూరులోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేసిన కామెంట్స్‌ను ఖండించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో.. రాష్ట్రం ఏమాత్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా ఎమ్మెల్యే రాగమయి, దయానంద్‌లు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరోపణలు చేసే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్ చౌదరి, ఎస్కే యాకూబ్ అలీ, లింగనబోయిన పుల్లారావు, కేవీఆర్, భూక్యా శివకుమార్ నాయక్, దామాల రాజు, లక్కినేని రమేష్, చిమిరాల సురేష్, దారా రంగా, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి నివాళి



కృష్ణమూర్తి, ప్రేమలత దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

తల్లాడ: ఇటీవల అనారోగ్యంతో జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జక్కంపూడి కృష్ణమూర్తి అకాల మృతి చెందగా అది తట్టుకోలేక ఆయన సతీమణి ప్రేమలత ఆత్మహత్యకు పాల్పడిన విషయం విధితమే. ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బిల్లుపాడులో వారి నివాసానికి వెళ్లి ఆ దంపతుల చిత్రపటం వద్ద నివాళులర్పించి.. కుంటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణపురంలో అనారోగ్యంతో మృతి చెందిన వీరనరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీనారాయణ, నాయకులు దయానంద్, బ్రహ్మయ్య, రఘుపతిరెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, రమేష్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

వీరభద్రం మృతికి డీసీసీ అధ్యక్షుడు..



వీరభద్రం భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, తదితరులు

వైరా: వైరా మున్సిపాలిటీ 4వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పదిమెల పుష్పలత భర్త కాంగ్రెస్ నాయకుడు పదిమెల వీరభద్రం రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ సందర్శించి మృతదేహంపై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. వీరభద్రం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పాలేటి నరసింహారావు, పాదిల హరినాద్, బోళ్ల గంగారావు, పమ్మి అశోక్, చంద్రశేఖరరెడ్డి, శ్రీను, రామారావు, గోపి పాల్గొన్నారు.

శేషులు మృతి పార్టీకి తీరని లోటు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన సీనియర్ సీపీఐ నాయకుడు బానోత్ శేషులు మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా బాబు అన్నారు. ఆదివారం శేషులు సంస్మరణ సభ తనికెళ్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు, పీవీ రావు, విష్ణుమూర్తి, శంకరరావు, వెంకటి, బాషా, నాగరాజు, సైదారావు, రాములు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రంగమ్మకు నివాళులర్పించిన మువ్వా..

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తూము రంగమ్మ చిత్రపటానికి ఆదివారం రాష్ట ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రంగమ్మ కుమారులు గంగదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, నూతనకల్ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావులను పరామర్శించారు. వెంకటేశ్వరరావు, రవి, గోపాల్‌రావు, శ్రీనువాసరావు, లక్ష్మణ్‌రావు, న్యాయ వాది లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లకు చెందిన సీనియర్ టీడీపీ నాయకులు మాజీ తెలుగు రైతు జిల్లా కమిటీ సభ్యుడు తుప్పతి రామలక్ష్మణుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని టీడీపీ మండలాధ్యక్షుడు తాతా సుధాకర్‌రావు, నాయకులు గూదె వెంకన్న, అన్నవరపు వెంకటేశ్వర్లు, రామారావు, శ్రీను, వెంకన్న తదితరులు సందర్శించి మృత దేహం పై పార్టీ పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు.

మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



ఎర్రుపాలెం: పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మధిర/ఎర్రుపాలెం: మధిర పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంద కృష్ణ మాదిగ మూడు దశాబ్దాల పాటు చేసిన పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిందని వివిధ పార్టీల నాయకులు డాక్టర్ కోట రాంబాబు, మొండితోక జయాకర్ తదితరులు తెలిపారు. అదే విధంగా ఎర్రుపాలెంలోని రామన్నపాలెంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు నగేష్ ఆధ్వర్యంలో మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నగేష్, బాబురావు, ప్రభాకర్, సునీల్ మాదిగ, లోకేష్, రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు కూరపాటి సునీల్, రాష్ట్ర నాయకుడు ప్రభాకర్ మాదిగ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరా బంద్ చేయనున్నట్లు విద్యుత్ ఏఈ రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నారుగూడెం, గోపాలపేట, నరసింహారావుపేట, లక్ష్మీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలనీ కోరారు.

నేడు చింతకానిలో ప్రజావాణి కార్యక్రమం

చింతకాని: కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనంతరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించటం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు దరఖాస్తులను అధికారుల స్వీకరించి రశీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ దరఖాస్తులపై ప్రతీ శుక్రవారం సమీక్ష నిర్వహించి సమస్యను పరిష్కరించటం జరుగుతుందని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కారేపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మాలోత్ శంకుతల ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో సకాలంలో హాజరుకావాలన్నారు.

ఏడువేల మొక్కలు సిద్ధం..



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

- స్వచ్ఛదనం... పచ్చదనం విజయవంతం చేయండి
- మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్

సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలోని సెంట్రల్ డివైడర్‌తో పాటు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసేందుకు ఏడువేల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం స్వచ్ఛదనం.. పచ్చదనంపై జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలతో పాటు పిచ్చి మొక్కలు తొలగించటం, ఎప్పటికప్పుడు చెత్త శుభ్రం చేయటం, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించి బ్లీచింగ్ చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో కమిషనర్ మందా రవిబాబు, వైస్ చైర్మన్ సుజలరాణి, కౌన్సిలర్లు కంటే నాగలక్ష్మి, మారుతి సూరిబాబు, వార్డు ఆఫీసర్లు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి



బోనకల్: మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

వేంసూరు: ప్రతీ గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు అన్నారు. ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి జ్వరాల బారిన పడిన ప్రజలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ నిధులను పక్కదారి పట్టించి సర్పంచ్‌లను ఇబ్బందులకు గురి చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు మంజూరు చేయకపోవడంతో కార్యదర్శులు అప్పులు చేసి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. అప్పుల భారంతో పారిశుద్ధ్య పనులు పూర్తి స్థాయిలో చేయకపోవడంతో ప్రజలు రోగాల భారీన పడుతున్నారన్నారు. కావున ఒక్కో పంచాయతీకి రూ.5 నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు రాంబాబు, బాలకృష్ణారెడ్డి, నాగసురేంద్రరెడ్డి, మహేష్, నవీన్, వెంకటరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

బోనకల్: బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. డాక్టర్ పవన్‌కుమార్, డి.సాయికుమార్ బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బత్తినేని చారిటబుల్ చేస్తున్న సేవలను అభినందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు బీపీ, షుగర్, పక్షవాతం లాంటి వ్యాధులకు వ్యాయామం ఎంతో అవసరమన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా బీపీ, షుగర్‌లు వస్తున్నాయని, ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బొమ్మినేని కొండల్‌రావు, వేమూరి పూర్ణచందర్ రావు, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్, ఆకెన పవన్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక మృతిపై ఆరోగ్యశాఖ ఆరా..



రేగళ్లపాడులో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ప్రైవేట్ ఆస్పత్రిలో శనివారం రాత్రి చికిత్స పొందుతూ రేగళ్లపాడుకు చెందిన షేక్ సన తబుసం మృతి చెందిన ఘటనపై ఆరోగ్యశాఖ ఆదివారం ఆరా తీసింది. గంగారం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామారావు, ఏఎన్ఎం కామేశ్వరి మృతురాలు ఇంటివద్ద వివరాలు సేకరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించి, వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బాలిక మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఆర్.అవినాష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దినేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెండ్‌షిప్‌డే వేడుకలు



మధిర: శుభాకాంక్షలు తెలుపుకుంటున్న స్విమ్మర్స్‌అసోసియేషన్ సభ్యులు

మధిర: పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బదిలీపై వెళ్లిన స్విమ్మర్ ఊటుకూరు భాస్కరరావును సన్మానించారు. అదే విధంగా వినాయకుడి గుడి వద్ద మధిర సేవాసమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో, కలయిక వాకర్స్ అధ్యక్షుడు ఇరుకుళ్ళ బాల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్నేహితులకు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టుకొని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

సత్తుపల్లిటౌన్: స్నేహితుల దినోత్సవ వేడుకలను సత్తుపల్లిలో విద్యార్థులు, యువత, వివిధ వర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ల కొనుగోళ్లతో దుకాణాలు రద్దీగా మారాయి. పిల్లల నుంచి పెద్దల వరకు స్నేహితులకు ఫ్రెండ్‌షిప్‌బ్యాండ్లు కట్టి శుభకాంక్షలు తెలుపుకున్నారు.

ముదిగొండ: ముదిగొండలోని మచ్చా వీరయ్యభవనంలో డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

పంటల సాగు లెక్క.. నమోదు పక్కా

- క్షేత్ర స్థాయిలో పంటల వివరాలు సేకరిస్తున్న ఏఈఓలు
- సాగులో ఉన్న పంట, వరిసాగులో రకాలు సైతం నమోదు



పంటల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

వేంసూరు: ఖరీఫ్‌లో రైతులు సాగుచేస్తున్న పంటల వివరాల సేకరణలో వ్యవసాయ అధికారులు నిమగ్నమయ్యారు. గ్రామాల వారీగా రైతులు ఏయే పంటలు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పంటసాగు చేస్తున్నారా.. లేదా తదితర వివరాలను ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తున్నారు. పంటల వారీగా వివరాలను సేకరించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక యాప్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం,దిగుబడులు, పరిగణనలోకి తీసుకొని కొనుగోలు కేంద్రాలు,గిట్టుబాటు ధరలు, పంటలకు నష్టపరిహారం తదితర వాటిని ప్రభుత్వం నిర్ణయిస్తుందని అంటున్నారు.

నమోదు లేకుంటే ఇబ్బందులే..

గతేడాది వేంసూరు మండలంలో సుమారు 32 వేల ఎకరాల్లో రైతులు పంటల సాగు చేశారు. ఇందులో వరి 28 వేల ఎకరాలు, పత్తి 712, మిర్చి 145 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం పంటల సాగు సర్వే అధికారులు చేపట్టారు. వ్యవసాయ శాఖ చేపడుతున్న పంటల సర్వేలో రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోకుంటే పంట విక్రయాలకు, ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు పరిహారం అందుకునేందుకు ఇబ్బందులు తప్పవని అధికారులు చెబుతున్నారు. రైతులు తమకున్న భూమిలో సర్వే నంబర్ వారిగా విస్తీర్ణం, పంటల సాగును అధికారులకు తెలిపితే అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పంటల వివరాలు, విత్తన రకాలు, నీటి వస తి, యంత్ర పరికరాలు, పశువులు వివరాలు యాప్ లో నమోదు చేయడంతో రైతులకు మేలు చేస్తుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

నమోదు తప్పనిసరి..



ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటల వివరాలు ఏఈఓల వద్ద నమోదు చేసుకుంటే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏఈఓలు గ్రామాల వారిగా పర్యటించి రైతుల సమక్షంలో వారు సాగు చేస్తున్న పంటల వివరాలు, సాగు విస్తీర్ణం, విత్తన రకాలు తదితర వివరాలు యాప్‌లో నమోదు చేస్తారు. వీటి ద్వారా ధాన్యం అమ్ముకునే సమయంలో, అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన సమయంలో రైతులకు మేలు జరుగుతుంది.

– రామ్మోహన్, మండల వ్యవసాయాధికారి, వేంసూరు